ఇంటింటికీ పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం విఫలం

- కమ్యూనిటీ హాళ్లు, రచ్చబండల వద్ద అందజేత
- లబ్ధిదారులకు తప్పని అవస్థలు



పాత మూలకుద్దు కమ్యూనిటీ హాలు వద్ద గుంపుగా పింఛన్లు పంపిణీ చేస్తున్న ఉద్యోగి



చినగాగమయ్యపాలెం శివారు రచ్చబండ వద్ద గుంపుగా పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

తగరపువలస : ఇంటింటికీ పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పేరుతో లబ్ధిదారులకు నగదు పంపిణీలో తొలిరోజైన సోమవారం చతికిల పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్కో వలంటీరు 50 ఇళ్లకు పింఛన్ల పంపిణీని వేకువజామునే పూర్తి చేసేవారు. ఇంటి తలుపు తట్టి లబ్ధిదారులకు నేరుగా నగదు అందించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వలంటీర్లను కాదని సచివాలయ సిబ్బందితో పంపిణీ చేస్తామని బీరాలు పలికి లబ్ధిదారులతోపాటు సచివాలయ సిబ్బందికి చుక్కలు చూపించింది. కూటమి నాయకుల హడావిడి తప్ప లక్ష్యం పూర్తిగా నెరవేరలేదు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వ ప్రయోగం గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా విఫలమైంది. జీవీఎంసీ పరిధిలో సిబ్బంది ఆపసోపాలు పడి ఎలాగోలా లబ్ధిదారుల చెంతకు సాయంత్రంలోగా పింఛను సొమ్ము అందించినా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ పింఛను పంపిణీ ఒక్కరోజులో సాధ్యం కాదని కూటమి నాయకులతోపాటు సచివాలయ సిబ్బందికి తెలిసొచ్చింది. అంతేకాకుండా సచివాలయ సిబ్బంది అంతా పింఛన్ల పంపిణీలో మునిగితేలగా సచివాలయాలకు మిగిలిన పనుల మీద వచ్చిన ప్రజలకు మూసి ఉన్న తలుపులే కనిపించాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్ద పింఛన్ల కోసం ఎదురు చూసిన లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. చివరకు ఊరి చివర రచ్చబండ, కమ్యూనిటీ హాళ్ల వద్ద గుంపులుగా నిరీక్షించిన తర్వాత కానీ చాలా మంది పింఛనుదారులకు డబ్బులు చేరలేదు.



పరదేశిపాలెంలో పింఛను కోసం వేచి ఉన్న వృద్ధులు

సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ

భీమునిపట్నం : లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికీ సచివాలయ సిబ్బంది అందుకు భిన్నంగా వ్యవహరించారు. చాలా ప్రాంతాల్లో లబ్ధిదారులు సచివాలయాలకు రావాలని సిబ్బంది తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పింఛనుదారులు ఆయా సచివాలయాలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. ఎన్నికల కోడ్ వల్ల రెండు నెలలు ఇబ్బందులు పడిన వీరంతా ప్రస్తుతం ఇళ్ల వద్దే తమకు పింఛన్లు అందుతాయని ఆశించినా నిరాశే ఎదురైంది. మళ్లీ సచివాలయానికి వెళ్లి పింఛన్ల నగదు తీసుకోవడం సమస్యగా మారింది.

సర్వర్ పనిచేయక అవస్థలు

మధురవాడ : ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీకి తొలిరోజే సర్వర్ పనిచేయక సచివాలయ సిబ్బంది, పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సర్వర్ 8 గంటల తర్వాత నుంచి 1 గంట వరకు మొరాయించడంతో లబ్ధిదారులంతా సచివాలయాలు, సచివాలయ కార్యదర్శుల చుట్టూ తిరగక తప్పలేదు. దీంతో గతంలో ఇంటి వద్దే తీసుకున్న పింఛను నగదు కోసం ప్రస్తుతం సచివాలయం వద్దకి వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. పరదేశిపాలెం, మారికవలస, పిలకవానిపాలెం, మారికవలస ఆర్‌జీకే కాలనీ తదితర చోట్ల ఇవే పరిస్థితులు కనిపించాయి. సర్వర్ పనిచేయక సచివాలయ కార్యదర్శులు కార్యాలయాల్లోనే వుండిపోయారు.



సర్వర్ పనిచేయకపోవడంతో మారికవలస ఆర్‌జీకే కాలనీ సచివాలయం వద్ద కార్యదర్శులు



నడవలేని వృద్ధురాలిని పింఛన్ డబ్బుల కోసం సచివాలయానికి తీసుకెళ్తున్న మహిళ



పిలకవానిపాలెంలో అందరినీ ఒకే చోటకు పిలిచి పింఛను నగదు అందిస్తున్న సచివాలయ కార్యదర్శి

- మధురవాడ స్వతంత్రనగర్‌లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ఉదయం లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, జెడ్సీ శైలజా వల్లి, ఏపీడీ గంగాధర్ పాల్గొన్నారు. 7వ వార్డులో కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ లబ్ధిదారులకు పింఛన్ల నగదు పంపిణీ చేశారు.

సచివాలయాలు మూసివేత



మంగమారిపేటలో తెరుచుకోని సచివాలయం

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట, కె.నగరపాలెం ప్రాంతాల్లో సచివాలయాలు సోమవారం తెరుచుకోలేదు. పింఛన్ల పంపిణీలో భాగంగా అధికారులు అందరూ ఇంటింటికీ వెళ్లారు. వలంటీర్ వ్యవస్థను దూరం చేయడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఏకంగా సచివాలయానికి తాళం వేశారు. దీంతో స్థానికులు పలు సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి వచ్చి నిరాశతో వెనుతిరిగారు. ముందుగా సమాచారం లేకుండా సచివాలయం మూసివేయడం ఏమిటని ప్రశ్నించారు.

పరిసరాలు పొడిగా ఉంచుకోవాలి



అవగాహన కార్యక్రమంలో జెడ్సీ శ్రీవల్లి, తదితరులు

కొమ్మాది : వర్షాలు కురుస్తున్నందున విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు ఎప్పటికప్పుడు పరిసరాలను పొడిగా ఉంచుకోవాలని జోన్ – 2 జోనల్ కమిషనర్ శ్రీవల్లి సూచించారు. జీవీఎంసీ 8వ వార్డులో ఏఎంవోహెచ్ ఎన్.కిషోర్‌తో కలిసి ఎండాడలో సోమవారం పర్యటించారు. ముందుగా డెంగ్యూ నివారణపై, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలు వేర్వేరుగా ఉంచాలని సూచించారు. అదే విధంగా డెంగ్యూ వ్యాప్తి, నివారణ మార్గాలను వివరించారు. కార్యక్రమంలో ఏడీసీ వర్మ, మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ మంగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక



పాఠశాలలో పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం : భీమిలిలోని నెహ్రూ ఉన్నత పాఠశాలలో 2012లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం అదే స్కూల్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో సరదాగా గడిపిన సంగతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దత్తి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు నాగభూషణరావు, సత్యరాజ్‌లను కలిసి వారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు గడియారాలు బహూకరించారు. సాయంత్రం వరకు అందరూ సరదాగా గడిపారు. ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రానికి యూనిఫారాలు



కేంద్రం చిన్నారులతో పైడిరాజు

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస భరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రానికి శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన రాజు గారి కుకింగ్ అండ్ క్యాటరింగ్ యజమాని తుపాకుల పైడిరాజు సోమవారం యూనిఫారాలు అందించారు. రూ.10వేల విలువైన యూనిఫారాలు అందించినట్టు ఆశ్రమ వ్యవస్థాపకుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు దాతకు ధన్యవాదాలు తెలిపారు.


పూడికతీత పనులకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గంటా శ్రీనివాసరావు

పద్మనాభం : కృష్ణాపురంలోని సాగునీటి కాలువలో పూడికతీత పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూడికతీత వల్ల కృష్ణాపురం, పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం గ్రామాల భూములకు ఖరీఫ్‌లో వరి పంటకు సాగు నీరు అందుతుందని వివరించారు. అనంతరం పద్మనాభం గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కృష్ణాపురం సర్పంచ్ ఎం.లక్ష్మీ భవాని, ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి, నాయకులు కె.రమణ, కె.దామోదరరావు, కె.లీలావతి, కె.నగేష్ కుమార్, ఎం.అప్పలనాయుడు, ఎస్.అచ్చింనాయుడు పాల్గొన్నారు.

పింఛన్లు అందించిన ఎమ్మెల్యే గంటా



వృద్ధురాలికి పింఛన్ నగదు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం : భీమిలిలో మత్స్యకారులు నివశించే ఎగువపేట వద్ద సోమవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుతం అర్హులందరికీ పింఛన్లు అందిస్తోందని, రూ.4 వేలకు పెంచి ఇస్తున్నామని తెలిపారు. జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ గంటా అప్పలకొండ, అధికారులు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరీ దేవికి విశేష పూజలు



విశేష అలంకరణలో లలిత త్రిపుర సుందరీ దేవి



పూజలందుకున్న సిద్ధేశ్వర స్వామి

మధురవాడ: ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు కాలనీలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో లలితా త్రిపుర సుందరీ దేవికి, మహా కామేశ్వర స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అభిషేక ప్రియునికి పంచామృత సుగంధ, నారికేళ, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. మారేడు పత్రాలు, వివిధ రకాల పువ్వులతో పూజలు చేశారు. శ్రీ చక్రం సమేత అమ్మవారికి కుంకుమ పూజలు చేసి విశేషంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్, కమిటీ సభ్యులు ప్రతాపరాజు, సీహెచ్‌వై నాయుడు, జేడీ నాయుడు, కేవీ రావు, సోమేశ్వర రావు, సింహాచలం, విజయ్‌కుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షికోత్సవాల్లో ఆఖరి రోజు మంగళవారం ఆలయ ఆవరణలో అన్నప్రసాదం పంపిణీ చేస్తామని, భక్తులంతా విచ్చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

- మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద గల సిద్ధేశ్వర స్వామి పీఠంలోని అన్నపూర్ణ దేవీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజలోపాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు సేవాదృక్పథం అవసరం



గ్రామీణ వైద్యులను సత్కరిస్తున్న సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి యాజమాన్యం

తగరపువలస : గ్రామీణ వైద్యులు సేవా దృక్పథం కలిగి ఉండాలని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి సీఈవో చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యులను అనిల్ యాజమాన్యం సంగివలసలో సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు ఆస్పత్రులకు, ప్రజలకు వారధిలా పని చేస్తున్నారని కొనియాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వీరికి ప్రతీ నెలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే ఆస్పత్రి యాజమాన్యం నుంచి ప్రజలకు ఉచితంగా సేవలు కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపకుడు జంగం జోషి, మహిళా వైద్యులు బి.వి.ఎస్. రత్నకుమారి, ప్రతిమాదేవి, ఎం.సుగుణేశ్వరి, జీబీ రాజు, మంగా శివప్రసాద్, రాలి అప్పారావు, ఆకుల శ్రీనివాసరావు, గెద్ద చిరంజీవి, నజ్మా, ఈశ్వరి, నవీన్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు రమణ

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా త్వరలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొన్నగంటి రమణ తెలిపారు. సోమవారం పూర్వ విద్యార్థులు, పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ పాఠశాల వేడుకను అందరి సహకారంతో భారీగా నిర్వహించడానికి నిర్ణయించామని, ఆ మేరకు సన్నాహాలు చేస్తామని తెలిపారు. ఇందుకోసం ఈ నెల 7న మరోసారి అందరితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉత్సవాలు ఎలా నిర్వహించాలన్న దానిపై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. మాజీ కౌన్సిలర్ మైలిపల్లి లక్ష్మణరావు, పెద్ద టి.భీమారావు, గాడు అప్పలనాయుడు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

భీమునిపట్నం : భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్)కు ఐదు ఫిర్యాదులు అందాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి నాలుగు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చింది. వీటిని స్వీకరించిన జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ వినతులు పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

మధురవాడలో 16 ఫిర్యాదులు

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కి 16 అర్జీలు వచ్చాయి. సోమవారం మధురవాడ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్సీ శైలజావల్లి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జోన్‌లోని 5 నుంచి 13 వరకు వార్డుల్లోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఫిర్యాదులు అందించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి మూడు, ఈఈ వర్క్స్ – 06, విద్యుత్ – 02, రెవెన్యూ – 3, పబ్లిక్ హెల్త్ – 05, యూజీడీ – 1, వాటర్ సప్లై – 1 చొప్పున 16 ఫిర్యాదులు వచ్చినట్టు జెడ్సీ చెప్పారు. జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెంలో చెరువు ఆక్రమణను అడ్డుకోవాలని ఎస్.నరేంద్ర, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, లైట్లు వేయాలని చంద్రంపాలెం ఎస్‌జీజీవోస్ లే అవుట్‌కి చెందిన టి.అప్పారావు, మిథిలాపురి వుడా కాలనీలో భవనాలు నిర్మిస్తున్న ప్రాంతాలకు కాలువలు నిర్మించాలని అంబిక నరసింహ, దీక్షితులు, పీఎంపాలెం లాస్ట్ బస్టాప్ వద్ద డ్రైనేజీ శుభ్రం చేయడానికి అడ్డంగా ఉన్న అపార్ట్‌మెంట్ ఆక్రమణ తొలగించాలని ఉదయ్ కుమార్ కోరారు. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం




కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ 2వ వార్డు ఇన్‌చార్జి సరళారాణి, కరుణాకరరెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ 2వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎలాంటి పరిస్థితుల్లోనూ అండగా ఉంటామని పార్టీ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి అన్నారు. సంతపేట సీతారామాలయ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి నేతల అబద్ధపు హామీలు, ఈవీఎం ట్యాంపరింగ్ తదితర కారణాలేవైనా ప్రజల తీర్పును వైఎస్సార్‌సీపీ గౌరవిస్తుందన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచనల మేరకు పార్టీ తరపున ప్రతి కార్యక్రమాన్ని వార్డుల్లో నిర్వహించి ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అందుబాటులో ఉంటామన్నారు. జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి మాట్లాడుతూ మళ్లీ వైఎస్సార్‌సీపీదే భవిష్యత్ అన్నారు. వైఎస్ జగన్ నాయకత్వంలో మంచి రోజులు వస్తాయన్నారు. 40 శాతం ఓటుబ్యాంకు ఉన్న అతిపెద్ద పార్టీగా వైఎస్సార్‌సీపీ ఉంటే, 7వ స్థానంలో టీడీపీ ఉందన్నారు. ఈ దేశ చరిత్రలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసినన్ని సంక్షేమ పథకాలు ఏ ముఖ్యమంత్రీ అమలు చేయలేదన్నారు. సమావేశంలో నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, నందిక రమణ, జగన్నాథ ఎల్లాజీ, పీతల వెంకట అప్పారావు, చేట్ల శ్రీనివాసరెడ్డి, జీరు వేణుగోపాలరెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, నీలాతి రాము, ఊడికల శ్రీరామమూర్తి, వాసుపల్లి నరేంద్ర, సరగడ నాగిరెడ్డి, గేదెల సన్యాసిరెడ్డి, శీరపు నరసింగరావు, చిల్ల గణేష్‌రెడ్డి, బొట్ట సత్య, తోణంగి ఎల్లాజీ, గుజ్జు రాము, పీతల రాజారావు, పల్లా శ్రీను, ఎరుసు అప్పారావు, చిల్ల ప్రమీల, జీరు పద్మ, చేట్ల అప్పలసూరమ్మ పాల్గొన్నారు.

15లోగా హిందీ పరీక్షల ఫీజు చెల్లించాలి

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 15లోగా ఫీజులు చెల్లించాలని ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు కోరారు. భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల నుంచి ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 2016 నుంచి భీమిలి పరీక్షా కేంద్రంగా కేటాయిస్తున్నట్లు తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక, రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 89858 97419, 89856 47419లో సంప్రదించాలని కృష్ణారావు సూచించారు.

ఓం శ్రీ యోగా వ్యవస్థాపకుడు రమేష్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రమేష్

ఎంవీపీ కాలనీ: ఓం శ్రీ యోగా సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. యోగాలో చేస్తున్న విస్తృత సేవలకుగాను న్యూఢిల్లీకి చెందిన సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆ యూనివర్సిటీ వార్షికోత్సవంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నట్టు పేర్కొన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ లభించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఓం శ్రీ యోగా సెంటర్‌కు 'యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్'లభించిందన్నారు. గత 11 ఏళ్లుగా విశాఖ వాసులకు యోగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం ఆక్రమణ

తగరపువలస : ఆనందపురంలోని బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం అన్యాక్రాంతమై మరింత మంది చేతులు మారుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన స్థలంలో కొందరు వ్యూహాత్మకంగా పశువుల పాకలు నిర్మించి తర్వాత రేకుల షెడ్లు, ఇళ్లు నిర్మిస్తున్నారు. వసతి గృహం ప్రహరీ సైతం ఆక్రమణకు గురవుతున్నా అధికారులు స్పందించడం లేదు. పైగా వసతిగృహం చుట్టూ పశువులను కట్టేస్తున్నందున బాలికలు బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. పశువుల పేడ కారణంగా వసతిగృహం చుట్టూ నిత్యం అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. వసతిగృహం పక్క నుంచి జంగాల కాలనీకి వెళ్లే రహదారిని కూడా ఆక్రమించారు. పశువుల షెడ్లు, రేకుల షెడ్లు నిర్మించుకున్న తర్వాత విద్యుత్ మీటర్లు, పన్నులు వేయించుకుని ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలు విక్రయిస్తున్నా పంచాయతీ, మండల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. ప్రైవేట్ వ్యక్తులు ఇటీవల ఈ ప్రభుత్వ స్థలాల్లో సీసీ కెమెరాలు సైతం అమర్చారు. అయితే స్థానికుల ఫిర్యాదు మేరకు వాటిని తొలగించారు. వసతి గృహం, జూనియర్ కళాశాల, జంగాల కాలనీకి చెందాల్సిన స్థలాలు ప్రైవేట్ వ్యక్తుల కబంధ హస్తాల్లో చిక్కుకుంటున్నా చీమ కుట్టినట్టయినా లేని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా ఆ స్థలాలు పరిరక్షించాలని కోరుతున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మహిళ



లక్ష్మిని కుటుంబ సభ్యులకు అప్పగించిన ఏయుటీడీ కార్యదర్శి వాసు

అల్లిపురం: రైల్వే స్టేషన్లో భిక్షాటన చేసుకుంటున్న మహిళకు ఆశ్రయం కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు ఏయూటీడీ సిబ్బంది. వివరాలివి.. లక్ష్మి అనే మహిళ రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేసుకోవడంతో ఆమెను ఆర్పీఎఫ్ పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది సంరక్షించి, ఇటీవల టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్‌లో వసతి కల్పించారు. ఆమె నుంచి వివరాలు తెలుసుకున్న ఏయుటీడీ కార్యదర్శి ప్రగడ వాసు పద్మనాభం మండలంలోని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మళ్లీ ఇంటి నుంచి ఎక్కడికీ వెళ్లకుండా కట్టడి చేయాలని ఆమె కుటుంబ సభ్యులకు సూచించారు.